ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 23 డిసెంబరు 2024

ద్విచక్ర వాహనదారులు

హెల్మెట్లు ధరించాలి

- అతివేగం, మద్యం మత్తులో ప్రమాదాలు
- రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి
- మదనపల్లె రీజనల్ ట్రాన్స్‌పోర్టు అధికారి ప్రతాపరావు



ముఖాముఖి

మదనపల్లె టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపో వడంతోనే ప్రమాదాల్లో ప్రతి ఏటా వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే పలు అంశాల కారణంగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు భద్రతా ప్రామాణికాలు ఎలా పాటించాలి అన్న విషయమై మదన పల్లె రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారి డీపీ ప్రతాపరావుతో ఆంధ్రజ్యోతికి పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాలకు కారణాలు?

జవాబు: దూరప్రయాణాల సమయంలో రెస్ట్‌లెస్ డ్రైవింగ్, ద్విచక్ర వా హనదారులు హెల్మెట్లు ధరించకపోవడం, మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, వాతావరణం, రోడ్డు పరిస్థితిపై సరిగ్గా అవగాహన లేకపోవడంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రశ్న: కమర్షియల్ పర్మిట్లు, డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీ కార్డులు మంజూరులో ఆలస్యం అవుతోంది?

జవాబు: నాలుగు నెలల క్రితం వాహన్ సాఫ్ట్‌వేర్ వచ్చింది. కొన్ని ఎర్రర్‌ల వలన పర్మిట్లు ఆలస్యం అవుతున్నాయి. డీఎల్, ఆర్‌సీ కార్డుల జారీకి ప్రభుత్వం టెండర్లు పిలిచింది. త్వరలోనే చిప్‌కార్డులు వాహనదారులకు అందుబాటులోకి వస్తాయి.

ప్రశ్న: స్కూలు, కళాశాల బస్సుల ప్రమదాల నివారణకు ఏమి చర్యలు తీసుకున్నారు?

జవాబు: స్కూలు, కళాశాలల బస్సులు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాము. అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకోవాలని విద్యాసంస్థల యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చాము. బస్సుల్లో డోర్ వద్ద హెల్పర్‌ను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించాము. ఓవర్‌లోడ్‌తో విద్యార్థులను రవాణా చేయొద్దని ఆదేశించాము.

ప్రశ్న: జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల్లో వాహనాల తనిఖీ చేస్తున్నారా.?

జవాబు: మదనపల్లె యూనిట్ కార్యాలయంలోని ముగ్గురు ఇన్‌స్పెక్టర్లతో ప్రతిరోజు జాతీయ, రాష్ట్ర రహదారుల్లో వాహనాలు తనిఖీ చేస్తున్నాం. ప్రతి ఇన్‌స్పెక్టర్ వారంలో ఒక మండలం చొప్పున 11 మండలాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ప్రశ్న: దూర ప్రాంతాల వాహనాల ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకున్నారు?

జవాబు: దూరప్రాంతాల నుంచి వచ్చే డ్రైవర్లకు టోల్‌గేట్‌ల వద్ద ఫేస్ వాష్ చేయిస్తున్నాం. దీనివలన కొంత రిలాక్స్ అవుతున్నారు. అలాగే బ్లాక్‌స్పాట్స్ గుర్తించి అక్కడ బోర్డులు పెట్టి, వాహనాలు నెమ్మదించేలా చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న: మదనపల్లె యూనిట్ కార్యాలయంలో రవాణా సేవలు ఎలా అందుతున్నాయి?

జవాబు: యూనిట్ ఆఫీసులో ప్రతిరోజూ డీఎల్, ఎఫ్‌సీ టెస్టింగ్‌లు, రిజిస్ట్రేషన్‌లు, పర్మిట్లు జారీ చేస్తున్నాము. అంతర్రాష్ట్ర సర్వీసులకు కూడా టెంపరరీ పర్మిట్లు జారీ చేస్తున్నాము. వాహన్ యాప్‌తో రవాణా సేవలు సులువు చేస్తున్నాం. దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం చేరుతున్నారా?

జవాబు: మదనపల్లె యూనిట్ కార్యాలయానికి ప్రభుత్వం రూ.3 కోట్లు లక్ష్యంగా ఇచ్చింది. నాలుగు నెలల్లో రూ.1.17 కోట్లు జరిమానాల రూపంలో వసూలు చేశాము. ఇంకా నాలుగు నెలల్లో లక్ష్యాన్ని చేరుకుంటాము. నిత్యం 15 నుంచి 20 కేసులు రాస్తున్నాం.

నరసింహస్వామికి బంగారు కిరీటం వితరణ

- కిరీటం విలువ రూ.27 లక్షలు



కిరీటాన్ని అర్చకులకు అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి వారికి చెన్నైకి చెందిన దాతలు బంగారు కిరీటాన్ని వితరణగా అందజేశారు. చెన్నైకు చెందిన వసంత లక్ష్మీ, ఆమె కుమార్తె మాధవి, అల్లుడు మనోహర్‌లు 340.930 గ్రాముల బరువుతో రూ.27,01,587 విలువ చేసే బంగారు కిరీటాన్ని చేయించారు. ఈ బంగారు కిరీటాన్ని ఆదివారం సూపరింటెండెంట్ మునిబాలకుమార్‌కు అందజేశారు. స్వామి వారికి మొక్కుగా ఈ బంగారు కిరీటాన్ని వితరణగా ఇచ్చినట్లు దాతలు తెలిపారు. దాతలను వేద మంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, అనిల్, గోకుల్, పాల్గొన్నారు.



దాతలు వితరణగా ఇచ్చిన బంగారు కిరీటం



మృతి చెందిన హనుమంతు

వేటకు వెళ్లి బలయ్యాడు..

- అడవి పంది అనుకుని తుపాకీతో కాల్చేశారు..
- వేటగాళ్ల కాల్పులకు వ్యక్తి మృతి, మరొకరికి గాయాలు
- పోలీసుల అదుపులో పలువురు అనుమానితులు



గాయపడిన రమణను రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వారికి అప్పుడప్పుడూ అడవికి వెళ్లి అడవి జంతువులను వేటాడటం అలవాటు.. ఈ నేపథ్యంలో.. ఆదివారం అడవి పంది వేట కోసం శనివారం అర్థరాత్రి అడవిలోకి వెళ్లారు. తుపాకులతో కొందరు.. నాటుబాంబులతో మరికొందరు వెళ్లారు. అయితే నాటుతుపాకులతో అడవిలోకి వెళ్ళిన వాళ్లు.. పొదల్లో ఉన్న వ్యక్తిని అడవి పంది అనుకుని పొరబడి జరిపిన కాల్పుల్లో హనుమంతు (45) అనే వ్యక్తి మృతి చెందగా రమణ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.. రాయచోటి ప్రాంతంలో కలకలం రేపిన అడవి పంది వేట సంఘటన వివరాల్లోకి వెళితే.. సంబేపల్లె మండలం నామాలకుంటకు చెందిన కొందరు పూసల కులస్థులు రాయచోటి మండలం కాటిమాయకుంట వద్ద గుడిసెలు వేసుకుని పాతసామాన్ల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం కొందరు అడవిలోకి వెళ్లి అడవి పందులు సంచరిస్తాయనే అంచనా ఉన్న స్థలంలో తినే వస్తువులలో నాటుబాంబులు పెట్టారు. ఈ వస్తువులను తిని బాంబులు పేలి అడవి పందులు చనిపోతే. ఇంటికి తెచ్చుకోవాలనుకున్నారు. అనంతరం అక్కడి నుంచి తమ ఇళ్లకు వచ్చి భోజనాలు చేసి అర్థరాత్రి సమయంలో అడవి పందుల కోసం తిరిగి అడవిలోకి వెళ్లారు. అయితే అదే సమయంలో మాధవరం గ్రామంలోని కొందరు అడవి పందులను వేటాడటానికి నాటుతుపాకులతో అడవిలోకి వెళ్లారు. అడవి పందులు సంచరిస్తాయనే అంచనా ఉన్న ప్రాంతంలో మాటు వేశారు. ఈ సంగతి తెలియని నాటుబాంబులు పెట్టి వెళ్లిన వాళ్లు.. చెట్ల పొదల్లో అడవిపందుల కోసం వెతకసాగారు. చెట్లు, కొమ్మల అలికిడి విని.. అడవిపందులే అనుకుని మాధవరం గ్రామానికి చెందిన వేటగాళ్లు నాటుతుపాకీతో కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో హనుమంతు, రమణలు తీవ్రంగా గాయపడ్డారు. తుపాకీ కాల్పులకు కుప్పకూలిన వాళ్ల అరుపులు విని..సంఘటనా స్థలానికి వెళ్ళిన నాటుతుపాకీ బ్యాచ్..అక్కడ మనుషులను చూసి భయపడి పారిపోయారు. గాయపడిన వాళ్లను తీసుకుని..మిగిలిన వాళ్లు గుడిసెల వద్దకు వెళ్లారు. అర్థరాత్రి కావడం.. వేటకు వెళ్లారంటే.. పోలీసు కేసులకు భయపడి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించలేదు. అయితే తీవ్ర గాయం కావడంతో విధిలేని పరిస్థితుల్లో ఆదివారం తెల్లవారుజామున రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాల్పులు జరిపిన సంఘటన కావడంతో వెంటనే పోలీసులు రంగప్రవేశం చేశారు. అయితే తాము వేటకు వెళితే ఇదంతా జరిగిందని చెప్పకుండా.. తాము తెల్లవారుజాము నాలుగు గంటలకు మాధవరం గ్రామానికి వెళ్తుండగా మద్దెలకుంట వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపినట్లు పోలీసులకు చెప్పారు. తీవ్రంగా గాయపడిన హనుమంతు కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. తీవ్రంగా గాయపడిన రమణ చికిత్స పొందుతున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు వాస్తవాలు బయటపడ్డట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు వాస్తవం కాదని గుర్తించి అసలు నిందితుల కోసం విచారణ ప్రారంభించారు. స్వయంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆయన పర్యవేక్షణలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు విచారణ చేపట్టాయి. ఈఘటనకు సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై ఆయుధ చట్టంతో పాటు వన్య ప్రాణి రక్షణ చట్టం కింద కూడా కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం. నాటు తుపాకీతో కాల్పుల సంఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ ఆంధ్రజ్యోతికి తెలిపారు. అక్రమ ఆయుధాలను కలిగి ఉండడం.. మనిషి మృతికి కారణం కావడంతో పాటు వన్యప్రాణులను వేటాడిన నేరాలపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కుందేలనుకుని కాల్చారు..

అచ్చం ఇటువంటి సంఘటనే ఈ ఏడాది జనవరి 29న మదనపల్లె మండలంలోనూ జరిగింది. మాలపాడు పంచాయతీ ఆవులపల్లె సమీపంలోని నల్లరాజుగారిపల్లెకు చెందిన సిద్దప్ప భార్య పాపులమ్మ అడవికి గడ్డి కోసమని వెళ్లింది. అదే గ్రామానికి చెందిన శివశ్రీరాములు, నాగరాజు, శ్రీనివాసులు అనే వ్యక్తులు వేట కోసం అడవికి వెళ్లారు. ఏపుగా పెరిగిన గడ్డిలో ఉన్న పాపులమ్మను గుర్తించని వీళ్లు.. గడ్డి కదులుతూ ఉండడంతో.. కుందేలనకుని తమ వద్ద ఉన్న నాటుతుపాకీతో కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు సుమారు నెలరోజుల పాటు తిరుపతిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడింది. ఈ సంఘటనలో పోలీసులు ఆయుధాల చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేశారు.

అత్తారింటి నుంచి వెళుతూ...
చెరువు కట్టపై బైక్‌ను ఢీకొన్న మినీ ట్రక్కు
భార్యాభర్తలు మృతి
7

భయం.. భయం..
- కనుగొండ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు
7

రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా
7

జనం ఉన్నా.. ధనం లేకపోవడమే

అభివృద్ధికి ఆటంకం

- మంత్రి నిమ్మల రామానాయుడు
- కూటమి అధికారంలోకి రావడానికి బలిజలే కీలకం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, నాయకులు బాలిశెట్టి హరిప్రసాద్, బట్టరుశెట్టి శ్రీనివాసులు తదితరులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాపులు ఆర్థికంగా బాగుంటారని చాలామంది అనుకుంటూ ఉంటారని.. ఇది కేవలం అపోహ మాత్రమేనని ఎక్కడో ఒకరిద్దరు అభివృద్ధి చెందినంత మాత్రాన కాపులు, బలిజలు అందరూ అభివృద్ధి చెందినట్లు కాదని.. జనం ఉన్నా ధనం లేకపోవడంతో అభివృద్ధి సాధించలేకపోతున్నామని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బలిజ కాపు ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్థులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని.. ఆ సామాజికవర్గానికి చెందిన అనేక మంది కౌలు రైతులు కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే ఈ సామాజికవర్గాలకు ప్రాధాన్యత లభించిందన్నారు. ఈ వర్గాల్లో ఆర్థిక అభివృద్ధిని బలోపేతం చేసే దానికి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. యువతకు రాయితీ రుణాలు అందించి ప్రోత్సహించిందని, విద్యాభివృద్ధికి ప్రత్యేక అవకాశాలు కల్పించిందన్నారు. అయితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాపు కార్పొరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిందన్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో రాయలసీమలో ఒకచోట కూడా బలిజలకు వైసీపీ సీటు కేటాయించలేదనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బలహీనవర్గాలను సమన్వయం చేసుకుంటూ వారికి సముచిత స్థానం కల్పించడం ద్వారా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రముఖులకు వారసులం : మంత్రి దుర్గేశ్

చరిత్రలోని ఎందరో ప్రముఖులకు కాపు బలిజలు వారసులని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. కూటమి అధికారంలోకి రావడానికి బలిజలు ఎంతగానో శ్రమించారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పరిపాలనలో ప్రజాస్వామ్య ఖూనీ అయిందని ఆ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిందన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఎ.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎన్నికల్లో 21 ఎమ్మెల్యే స్థానాలు రెండు ఎంపీ స్థానాలను జనసేన గెలుచుకోవడం జరిగిందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మరిన్ని స్థానాలు పెరుగుతాయన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లె సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ ఎక్కడా లేని విధంగా ఏ పార్టీలు, వర్గాలకు భయపడకుండా రాజకీయ లబ్ధి కోసం నేతల వద్ద డిమాండ్ చేయడం వల్లనే రాయలసీమేతర ప్రాంతాల్లో కాపు బలిజలు రాజకీయ పదవులు దక్కించుకున్నారన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ నిరాశ నిస్పృహ ఉన్న సమయంలో ఒక పాలెగాడు పుట్టుకొచ్చాడని.. ఇది చాలా సంతోషించదగ్గ విషయమంటూ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఉద్దేశించి అన్నారు. రాజకీయాల్లో రాణించడం అంత సులభతరం కాదన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి.హరిప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఎన్టీఆర్ బలిజలకు పెద్దపీట వేశారన్నారు. అయితే ఆర్థికంగా ఎదుగుదల లేకపోవడంతో కాపు, బలిజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయలసీమకు కాపు కార్పొరేషన్ నుంచి అధిక నిధులు కేటాయిస్తే ఇక్కడి ప్రాంత యువత అభివృద్ధి సాధించగలదన్నారు.

కాపు భవనానికి స్థలం ఇవ్వండి

జిల్లా కేంద్రమైన కడపలో కాపు భవన నిర్మాణానికి పాత రిమ్స్‌లో 50 సెంట్లు స్థలం కేటాయించాలని బలిజ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.నాగరాజు కోరారు. జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ జనాభాకు తగ్గట్లుగా బలిజలకు రాజకీయ ప్రాధాన్యత లేదన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు తాతంశెట్టి నాగేంద్ర వ్యాపారవేత్త పసుపులేటి హరిప్రసాద్, దాసరి రాము, కన్నా నాగరాజు, బీజేపీ నాయకులు చలపతి, పీవీఎస్ మూర్తి, ఎద్దుల సుబ్బరాయుడు, పెంచలయ్య ధనపాల్ జగన్, రమణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బి.శ్రీనివాసులు, దుర్గా మల్లికార్జున రావు, దుర్గాప్రసాద్, నాగరాజు, అతికారి కృష్ణ, కీర్తన, రేకం నారాయణ, గంధం ప్రసాద్, కొవ్వూరు మస్తాన్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు.. హాజరైన జనం

మహిళా రైతుకు పుడమిమిత్ర అవార్డు

- తెలంగాణ మంత్రి నుంచి అవార్డు అందుకున్న పద్మావతి



అవార్డు అందుకుంటున్న ప్రకృతి వ్యవసాయ రైతు పద్మావతి

చిన్నమండెం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటికోన పంచాయతీ నాగూరివాండ్లపల్లెకు చెందిన మహిళా రైతు కనకంటి పద్మావతికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా పుడమి మిత్ర అవార్డును అందజేశారు. జాతీయగాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు-2024 గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన ప్రతిష్టన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రం యాదగిరిగుట్టలో గాంధీ విజ్ఞాన్ సదస్సు జరిగింది. టమోటా పంట సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా పద్మావతికి అరుదైన గౌరవం దక్కింది. అలాగే ఆమె ప్రస్తుతం రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండిస్తున్న ఉత్పత్తుల మార్కెటింగ్‌లో విశేష స్పందన కనబరచడంతో బెస్ట్ మార్కెటింగ్ కార్యకర్తగా మరో అవార్డు కూడా వరించింది. అవార్డు అందుకున్న పద్మావతి మాట్లాడుతూ రైతులు ఒకే రకమైన పంటలు వేయడం మానుకుని పలు రకాలైన పంటలు ఒక క్రమ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా దిగుబడి బాగా వచ్చేందుకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయన్నారు. రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల మనుషుల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భూమి కూడా కలుషితమవుతుందని తెలిపారు. కనుక రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు.

హార్సిలీహిల్స్‌లో సండే సందడి..

- పర్యాటకులతో కిటకిటలాడిన హిల్స్

బి.కొత్తకోట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ ఆదివారం పర్యాటకులతో సందడిగా కనిపించింది. వారాంతంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా కర్నాటక నుంచి పెద్దసంఖ్యలో వచ్చారు. కుటుంబసమేతంగా వచ్చిన వారు, యువకుల బృందాలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు హిల్స్‌కు చేరుకుని గాలిబండ, అటవీశాఖ ప్రాంగణం, ఏరియల్‌వ్యూ పాయింట్, ఘాట్‌రోడ్డు మలుపులు, గంగోత్రి వద్ద కలియతిరిగారు. ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ హిల్స్‌పై ఉండే ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. మానససరోవరంలో బోటింగ్ చేసేందుకు కొత్తజంటలు, యువకులు ఉత్సాహం చూపారు. టూరిజం రెస్టారెంట్, ప్రైవేట్ రెస్టారెంట్లు సందర్శకులతో రద్దీగా కరిపించాయి. పర్యాటకుల రద్దీని కొండ దిగువ నుంచి పైకి తిరిగే ప్రైవేటు వాహనాల యజమానులు సొమ్ము చేసుకున్నారు.

హార్సిలీహిల్స్‌లో సేద తీరుతున్న పర్యాటకులు



అత్తారింటి నుంచి వెళుతూ...

చెరువుకట్టపై మినీ ట్రక్కు ఢీ - భార్యాభర్తలు మృతి



నరసింహ - సుజాత మృతదేహాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అత్తారింటి నుంచి ఇంటికి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కోలాటం నరసింహ(43), భార్య సుజాత(38) మృతి చెందారు. భువనగిరిపల్లె వాసులు నరసింహ దంపతులు అత్తారిళ్లు అయిన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట నుంచి స్వగ్రామం భువనగిరిపల్లెకు బైక్‌లో తిరిగి వస్తున్నారు. రెడ్డిపల్లె సమీప చెరువుకట్టపై అశోక లేలాండ్ మినీ వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో నరసింహ అక్కడి కక్కడే మృతిచెందాడు. అతని భార్య సుజాత, పాప, బాబు ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ఆమె మృతిచెందినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం పిల్లలను తిరుపతికి తరలించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మృతుడు నరసింహ భువనగిరిపల్లెలో జనసేన పార్టీకి కీలక కార్యకర్తగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



వరుణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వేకోడూరులో ఆదివారం చోటు చేసుకున్న ఘటన వివరాల్లోకెళితే... రైల్వేకోడూరు మండలం రాఘవ రాజపురం దళితవాడకు చెందిన పైనం వరుణ్ (29) రైల్వేకోడూరులో చికెన్ తీసుకుని ఇంటికి వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వరుణ్ బంధువులు, తల్లిదండ్రులు, స్నేహితులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వరుణ్‌కు ఏడాది కిందటే అపురూపతో వివాహమైందని తల్లిదండ్రులు సుబ్బరాయుడు, లక్ష్మీదేవి విలపించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తదితరులు తెలిపారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి



ఫరూక్ అహమ్మద్ మృతదేహం


లింగాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగి లారీ మీదపడడంతో విద్యుదాఘాతానికి గురై లారీడ్రైవర్ ఫరూక్ అహమ్మద్ మృతిచెందాడు. ఫరూక్ అహమ్మద్ స్వస్థలం శ్రీనగర్. అతను అరటి కాయలను లోడ్ చేసుకుని వెళ్లేందుకు ఆదివారం లింగాలకు వచ్చారు. ఫరూక్ అహమ్మద్ తన లారీని నీటితో శుభ్రంచేసుకునే సమయంలో పక్క పొలంలో మరో లారీ అరటికాయల కోసం వెళుతోంది. ఆ సమయంలో విద్యుత్ తీగలు గమనించకుండా లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో వైర్ లారీ క్యాబిన్‌కు తగిలి విద్యుత్ పోల్ పిన్ వద్ద బైండింగ్ వైర్ కట్ కావడంతో పైనున్న 11కేవీ విద్యుత్ లైన్‌కు తగలడం అదే సమయంలో ఫరూక్ అహమ్మద్ శుభ్రం చేసుకుంటున్న లారీమీద వైరు పడడంతో విద్యుత్ ప్రవాహం జరిగి షాక్‌కు గురై ఫరూక్ అహమ్మద్ కిందపడిపోయాడు. వెంటనే చికిత్స కోసం పులివెందులకు తరలించగా అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఆదివారం వైభవంగా మఠాధిపతి వీర శివకుమారస్వాముల ద్వారా ప్రారంభమయ్యాయి. వేకువ నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 5గంటలకు మఠాధిపతి, దంపతుల చేత ఈశ్వరీమాత ధార్మిక భవనం ప్రారంభోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 27 వరకు ఆరాధన గురుపూజా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భయం.. భయం..

- కనుగొండ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన
- అడవి వైపు వెళ్లని కాపరులు
- మరోసారి చిరుత ప్రత్యక్షం



చిరుత పులి సంచరిస్తున్న కనుగొండ అటవీప్రాంతం

ములకలచెరువు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పెద్దపాళ్యం సమీపంలోని కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారంతో తీవ్ర భయందోళన నెలకొంది. రెండు రోజుల కిందట అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంతో ఐదు మేకల జాడ కన్పించకపోవడం, మరో మేక మృతి చెందడం, మరొకటి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కాపరిపై కూడా చిరుతపులి దాడి చేసేందుకు ప్రయత్నించడం, తోడుగా ఉన్న కుక్కల సహాయంతో కాపరి పాళ్యం నరసింహులు ప్రాణాలతో బయటపడడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో కనుగొండ అటవీ ప్రాంతానికి అతి దగ్గరలో ఉన్న కొండ కింద రైల్వేగేటు వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇద్దరు యువకులకు చిరుత పులి మళ్లీ కన్పించిందని గ్రామాల్లో ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర అలజడి నెలకొంది. కనుగొండ అటవీ ప్రాంతానికి చుట్టుపక్కల సమీపాల్లో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె, శివరాంపల్లె, మావిళ్లవారిపల్లె, గోళ్లపల్లె, అడివిచెరువు తదితర గ్రామాల ప్రజలకు చిరుతపులి భయం పట్టుకుంది. ముఖ్యంగా మేకల మందపై దాడి చేసిన పెద్దజారు బండ సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారు.



అటవీ శాఖాధికారులపై ఆగ్రహం

చిరుతపులి కన్పించిన రోజు నుంచి అటవీ శాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరుత పులి కన్పించిందని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తే తూతూ మంత్రంగా వచ్చి విచారించి వెళ్లారని అంటున్నారు. చిరుతపులి భయం పోగొట్టేందుకు కనీసం కనుగొండ అటవీప్రాంతం సమీప గ్రామాల్లో అవగాహన కూడా కల్పించడం లేదని విమర్శిస్తున్నారు. చిరుతపులి కన్పించిన చోటికి ఇంతవరకూ వెళ్లలేదని, పెద్దపాళ్యం గ్రామంలోకి గురు, శుక్రవారం మాత్రం వచ్చి వెళ్లారని చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు చిరుతపులి మేకల గుంపుపై దాడి చేసిన పెద్దజారుడుబండ వద్దకు వచ్చి పాదముద్రలు పరిశీలించి సమీప గ్రామాల్లో భయం పోగొట్టాలని పలువురు కోరుతున్నారు.

అడవి వైపు కన్నెత్తి చూడని గొర్రెలు, మేకల కాపరులు

చిరుతపులి దాడి చేసిన రోజు నుంచి గొర్రెలు, మేకల కాపరులు అడివివైపు వెళ్లడానికి భయపడుతున్నారు. అడివికి సమీపంలోని చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 60 మంది వరకు కాపరులు గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీరందరూ అడివిని నమ్ముకుని ప్రతిరోజూ గొర్రెలు, మేకలు తోలుకెళ్లి మేపుకొచ్చేవారు. చిరుతపులి కన్పించినప్పటి నుంచి అడవిలోకి వెళ్లడానికి సాహసించడం లేదు. గ్రామాలకు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల వద్దకు తోలుకెళ్లి మేపుతున్నారు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న తమకు చిరుతపులి వల్ల భయం నెలకొందని, పరిస్థితి ఇలాగే ఉంటే గొర్రెలు, మేకలను అమ్ముకుని వలస వెళతామని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రక్తం మరిగిన చిరుతపులి గ్రామాల్లోకి వస్తుందేమో..



మా గ్రామానికి దగ్గరలో ఉన్న కనుగొండ అడవిలో చిరుత పులి కన్పించింది. మేకలను చంపి తిని చిరుతపులి బాగా రక్తం మరిగింది. ఇప్పుడు గొర్రెలు, మేకలు అడవికి తోలుకెళ్లకపోవడంతో ఆహారం లేక రక్తం మరిగిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉంది. సాయంత్రమైతే ఇంటి నుంచి బయటకు రావడానికి భయమేస్తోంది. అటవీ శాఖాధికారులు చిరుతపులి ఎక్కడుందో కనుగొని రాత్రివేళల్లో గ్రామాల్లో గస్తీ తిరగాలి.

- మల్లెల వెంకటరమణ, తుంగపల్లె

27 మేకలను తినేసింది..



చిరుతపులి ఇప్పటివరకు 27 మేకలను తినేసింది. మేకలను మేపుకొచ్చేందుకు కనుగొండ అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్లేవాడిని. దీపావళి పండగ నుంచి చిరుతపులి మేకలను పట్టుకుని వెళ్లి తినేసింది. మేకలు ఎక్కువగా ఉండడంతో గమనించుకోలేదు. మేకలు 120 ఉండేవి. ఇప్పుడు వందే ఉన్నాయి. నా కళ్ల ముందరే చిరుతపులి దాడి చేసి ఐదు మేకలను ఎత్తుకెళ్లింది. మరొకటిని చంపి ఒక మేకను గొంతు దగ్గర నోటితో పట్టుకుని గాయపరిచింది. నా పైనా కూడా దాడి చేసేందుకు వస్తుండగా నా వెంట ఉన్న కుక్కలు గట్టిగా అరవడంతో వెళ్లిపోయింది.

- పాళ్యం నరసింహులు, మేకల కాపరి

అక్షరాల శక్తిని చాటి చెప్పిన సన్నపురెడ్డి

సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి



సన్నపురెడ్డికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): అక్షరాలకున్న శక్తిని తన సాహిత్యం ద్వారా చాటి చెప్పిన కథ, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి అని ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు. కేతు పేరు మీద సన్నపురెడ్డికి అవార్డు మేలుకలయిక అన్నారు. ఇద్దరి మధ్య ఒక తరం అంతరం వున్నా అంతరాన్ని పూర్తి చేసుకుంటూ సన్నపురెడ్డి సాహిత్యం సృజిస్తున్నారన్నారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీబ్రౌన్ గ్రంథాలయంలో కేతు స్మారక జీవన సాఫల్య పురస్కార సభ ప్రసిద్ధ కథా రచయిత దాదా హయాత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, వారి సతీమణి దుర్గాకుమారి, డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు ద్వారా అవార్డును సన్నపురెడ్డికి అందజేశారు. ప్రధాన వక్త మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కథ, కథనానికి మధ్య తేడా అర్థం కావాలని, అప్పుడే ఈ కాలపు కథ అర్థం అవుతుందన్నారు. నిదుర పుచ్చేది కథ అయితే జాగృతం చేసేది కథానిక అవుతుందన్నారు. అలా చూసినపుడు సన్నపురెడ్డి రాసింది కథానికలన్నారు. ప్రపంచాన్ని ప్రేమించాలంటే చాలా వదులుకోవాల్సి వుంటుందన్నారు. ముందుగా మనలో దాగివున్న కులహంకారాన్ని, మతాహంకారాన్ని వదులుకోవాలన్నారు. సన్నపురెడ్డి రాసిన చాలా కథలు అవే చెబుతాయన్నారు. ఆయన రాసిన 'చనుబాలు' కులహంకారాన్ని కూలగొట్టే కథ అన్నారు. మనిషిలోని సంఘర్షణను చిత్రించాలంటే గొప్ప మనసు కావాలన్నారు. ఆ మనసు సన్నపురెడ్డికి వుంది కాబట్టే గొప్ప సాహిత్యం రాశారన్నారు. కథానిక నిర్మించడంలో ఆయన గొప్పతనం చూపారన్నారు. ఒక్క పదం కానీ ఒక్క వాక్యం కూడా వృధాగా వుండదన్నారు. ఎవరి గురించి చెబుతున్నారో ఆ జీవితం పదాల్లో కనబడుతూ వుంటుందన్నారు. కథల్లో పాత్రలను ఆయన రూపకల్పన చేస్తే అది మంచి కథల కోవలోకి రాదన్నారు. కథలో మెసేజ్ పాత్రల స్వభావాల ద్వారా చెబుతారన్నారు. ఆయన కథలు చదువుతున్నట్లు కాక చూస్తున్నట్లు వుంటాయన్నారు. అలా రాయాలంటే గొప్ప పరిణితి కావాలన్నారు. పురస్కార గ్రహీత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తన స్పందనను తెలియజేస్తూ కేతు విశ్వనాథరెడ్డితో తనకున్న సాహిత్య వ్యక్తిగత అనుబంధాన్ని పంచుకున్నారు. రాసిన కథలు, కథనాలను మెచ్చుకుని భుజం తట్టి ప్రోత్సహించడంతో తాను కథలు రాసినట్లు వెల్లడించారు. కథా రచయిత శశికళ, వైవీయూ పాలకమండలి సభ్యుడు మూల మల్లికార్జునరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, అభ్యుదయ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు చీపాటి రాజేశ్వరరావు, కేతు కుమారులు శశికాంత్, కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బలిజ సమావేశంలో వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్



ప్రసాద్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఆదివారం నిర్వహించిన కాపు, బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. జిల్లా బలిజ సంక్షేమ సంఘం పిలుపు మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బలిజలు తరలివచ్చారు. సమావేశంలో మంత్రులు వేదిక మీదకు వస్తుండగా పోరుమామిళ్లకు చెందిన రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్త రాళ్లపల్లె ప్రసాద్ కిందపడిపోయాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి బ్రెయిన్‌స్ట్రోక్ తగిలినట్లు చెప్పారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్తరాళ్లపల్లె ప్రసాద్ కుటుంబం పేదరికంలో ఉండడంతో ఆ కుటుంబానికి సహాయం చేయాలంటూ పలువురిని అభ్యర్థించారు.

పేదలకు అండగా 'లేవాకు నారపురెడ్డి ట్రస్ట్'



పేదలకు ధాన్యం పంచుతున్న లేవాకు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లె, పబ్బాపురం, రామచంద్రాపురంలో దాదాపు రెండెకరాల్లో పండించిన 80బస్తాల వరి ధాన్యాన్ని లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి, వైస్ ఛైర్మన్ లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి పేదలకు పంచిపెట్టారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ 2007 నుంచి తమ పొలంలో పండించిన పంటను పేదలకు పంచిపెడుతున్నట్లు చెప్పారు. నిరంతరం పేద ప్రజల కోసం లేవాకు చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. అలాగే వేసవి కాలంలో కడప వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాల్లో లేవాకు చారిటబబుల్ ట్రస్ట్ సేవ చేస్తూ అందరి మన్ననలు పొందతున్నామన్నారు.

మనుషుల్లో మానవత్వం వెల్లివిరియాలి : వీసీ



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న ఇన్‌టాక్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మనుషుల్లో మానవత్వం వెల్లివిరిసినపుడే సమాజం సుఖశాంతులతో ఉండగలదని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య విశ్వనాథకుమార్ అన్నారు. ఆదివారం ఇన్‌టాక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల ప్రేమ దయ క్షమాగుణం కలిగి ఉండాలని దైవ గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయన్నారు. ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడమే ధ్యేయమన్నారు. మన్సూర్ అలీఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ పోతుల వెంకటరామిరెడ్డి, డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, ఇన్‌టాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్ రెడ్డి, రాజశేఖర్ రాహుల్, గౌరీశంకర్, పాస్టర్ విజయ్‌కిషోర్ మాట్లాడారు. పాస్టర్ విజయ్‌కిషోర్ పర్యవేక్షణలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసులు, కొండారెడ్డి, గంగాధర్, సంపత్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్, సంజీవరెడ్డి, నాగవేణి, పార్వతి పాల్గొన్నారు.

రూ.13.19 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

- జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్



పీలేరులో ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్

పీలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 43 ప్రభుత్వ వసతి గృహాలకు రూ.13.19 కోట్లతో మరమ్మతులు చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్ తెలిపారు. పీలేరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను చేపడతామన్నారు. అందులో భాగంగా జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని తొమ్మిది వసతి గృహాలకు రూ.2.40 కోట్లు, రాజంపేట నియోజకవర్గంలోని ఆరు వసతి గృహాలకు రూ.1.93 కోట్లు, రాయచోటి నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.3.02 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలోని మూడు వసతి గృహాలకు రూ.78 లక్షలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఒక వసతి గృహానికి రూ.10 లక్షలు, పీలేరు నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.4.97 కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు. వసతి గృహం వంటశాల, డార్మిటరీ, మరుగుదొడ్లు, నీటి వసతిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను తొలగించిన కొత్త వాటిని నిర్మిస్తామని, ఉరుస్తున్న డార్మిటరీ పైకప్పును మారుస్తామన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్ శాఖాధికారులతో మరోమారు వసతిగృహాన్ని సందర్శిస్తామన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి, వసతి గృహ వార్డెన్లు రమాదేవి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

- 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు
- పనులు నిలిపివేయించిన పోలీసులు



ఆక్రమించి పనులు చేస్తున్న దృశ్యం - స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నవీన్‌బాబు

రైల్వేకోడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీపార్వడైజ్ సినిమా హాలుకు సమీప ప్రధానదారికి పక్కనే ప్రభుత్వ స్థలాన్ని ఖద్దరు బాబుల అండతో ఆక్రమించి భవన నిర్మాణాలు చకచకా జరిగిపోతున్నాయి. నిర్మాణం జరుగుతున్న 20 అడుగుల స్థలం రూ. కోటి విలువ చేస్తుంది. ఆక్రమణదారుడు ఎవరు వచ్చినా ఏమీ చేయలేరని బహిరంగంగా నిర్మాణాల వద్దకు వచ్చిన వారిపై దౌర్జన్యం చేస్తున్నాడు. స్థానికులు నేషనల్ హైవే అథార్టీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో కొన్ని రోజుల పాటు పనులు నిలిపి వేశారు. ఖద్దరు బాబులు రంగప్రవేశం చేసి ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు పనులు చేసుకోమని చెప్పడంతో ఆక్రమణదారుడు పనులు చకచకా చేపట్టాడు. ఆదివారం అందిన సమాచారం మేరకు రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో ఆక్రమణ నిర్మాణాలను పరిశీలించారు. వెంటనే పనులు నిలుదల చేయాలని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. కోడూరులో కబ్జాల పర్వం పరిపాటిగా మారుతోంది. ఖద్దరు అండతోనే కబ్జాలు సాగుతున్నాయి. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఎవరైనా అడ్డుకున్నా వారిపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లగా లక్ష్మీపార్వడైజ్ సినిమా థియేటర్ వద్ద ప్రధానదారిపై నేషనల్ హైవే అథార్టీ అధికారి నారాయణ నాయక్ వచ్చి ఆక్రమణలు ఆపాలని తమకు విన్నవించారని తెలిపారు. ఆ మేరకు ఆక్రమణ నిర్మాణాలను ఆపామని తెలిపారు. మళ్లీ ఆక్రమణ పనులు జరుగుతున్నాయని సమాచారం రావడంతో తన సిబ్బంది వెళ్లి పనులు నిలుపు చేయించారని తెలిపారు. నేషనల్ హైవే అథార్టీ అధికారులు ఫిర్యాదు ఇస్తే వెంటనే కేసు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు.

వృద్ధుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు

రామాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఉంటున్న రిటైర్డ్ లెక్చరర్ నాగూరు వెంకటరెడ్డి (70) 18వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన భార్య దుగ్గసాని వెంకటలక్ష్మి ఆదివారం ఉదయం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఆయనకు మతి స్థిమితం సరిగ్గా లేకపోవడంతో మందులు వాడుతూ ఉంటాడని, ఆచూకీ తెలిసిన వారు రామాపురం పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని తెలిపారు.

తిరుపతి గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



తిరుపతి గంగమ్మకు పూజలు చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొంతంవారిపల్లెలో ఆదివారం తిరుపతి గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు హాజరయ్యారు. మండల టీడీపీ అధ్యక్షుడు కల్లే రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు మాలేపాటి సురేశ్‌నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోహన్‌బాబు నాయుడు, మాజీ సర్పంచ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణ కమిషన్ రాష్ట్ర కన్వీనర్‌గా మంజుల



గాలివీడు, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా తనను నియమించినటు గాలివీడు పీహెచ్ సీ స్టాఫ్‌నర్సు మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషన్ అంతర్జాతీయ అధ్య క్షుడు డాక్టర్ హెచ్‌ఎండీ ముజాహిద్ శని వారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. మహిళల హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చి ముస్తాబు

రామాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామాపురంలోని ఆర్సీఎం చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతోంది. ఆదివారం నుంచి ప్రార్థనలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పూడిక తీశారు.. ఎత్తడం మరిచారు

నందలూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్యకచెరువుకు చెయ్యేరు నుంచి నీటిని తరలించే కాలువ నుంచి తీసిన పూడికను రోడ్డుకు అడ్డంగా పడేసి వారం రోజులైనా తొలగించక పోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికైనా రోడ్డుపై అడ్డంగా ఉన్న బురదను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరెమ్మకు పూజలు

తంబళ్లపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యో తి): మండల కేంద్రంలోని సిద్దారెడ్డిగారి పల్లెలో నాయీ బ్రాహ్మణుల కులదేవత ఆరెమ్మకు ఆదివారం ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ప్రతి ఏటా డిసెంబరు నెలలో నాయీ బ్రాహ్మణ కుటుంబాలలోని పురుషులు ఆరెమ్మకు దివ్వెలూ, బోనాలూ సమర్పించి పూజలు నిర్వహిస్తారు. ఆదివారం ఆ సంఘం మండలాధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో కాలినడకన దివ్వెలు, బోనాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రజలందరూ సఖసంతో షాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

అటవీ చెక్‌పోస్టుతో.. అభివృద్ధికి ఆటంకం

- వాహనాల సంచారంపై నిషేధంతో నిర్మానుష్యంగా సిద్దవటం
- అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు



సిద్దవటం - బద్వేల్ రహదారి కపర్దీశ్వరకోన వద్ద అటవీశాఖ చెక్‌పోస్టు

సిద్దవటం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కలివికోడి పరిరక్షణ, ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా ఫారెస్టు చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో పాటు, రాత్రి వేళల్లో సిద్దవటం-బద్వేలు మార్గంలో వాహన రాకపోకలపై నిషేధం విధించడం సిద్దవటం మండల అభివృద్ధికి ఆటంకంగా మారింది.

వాహనాల కింద పడి వన్యప్రాణులు చనిపోతుండడంతో సిద్దవటం-బద్వేలు మార్గంలో రాత్రి వేళల్లో వాహనాల సంచారాన్ని నిషేధించాలంటూ కడప డీఎఫ్‌వోగా పనిచేసిన బీఎస్ఎస్ మూర్తి అప్పటి జిల్లా కలెక్టర్ అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అందుకు అంగీకరించని కలెక్టర్ లంకమల అభయారణ్యంలోని 13 కిలోమీటర్ల పరిధిలో వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా స్పీడు బ్రేకర్లు ఏర్పాటుకు అనుమతించారు. ఆయన బదిలీ అనంతరం, వచ్చిన కలెక్టర్ కోన శశిధర్ దృష్టికి వాహనాల నిషేధం అంశాన్ని డీఎఫ్‌వో తీసుకెళ్లారు. దీంతో రాత్రివేళల్లో వాహన రాకపోకలను నిషేదిస్తూ 2013 ఫిబ్రవరి 14న అప్పటి కలెక్టర్ గెజిట్ విడుదల చేశారు. 285 జీవో కింద సిద్దవటం - బద్వేలు మీదుగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల రాకపోకలను మూయించారు. దీంతో ఈ మార్గంలో రాత్రి వేళల్లో ప్రయాణించే విజయవాడ, విశాఖపట్టణం, బెంగుళూరు, తిరుపతి, నెల్లూరు పొదిలి, కావలి, చెన్నై తదితర దూర ప్రాంతాల బస్సు సర్వీసులు రద్దయ్యాయి. అవన్నీ ప్రస్తుతం మైదుకూరు మీదుగా తిరుగుతున్నాయి. దీంతో రాత్రి 9 గంటలకే సిద్దవటం నిర్మానుష్యంగా మారుతోంది. ఈ పరిస్థితి సిద్దవటం అభివృద్ధికి ఆటకంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు స్థానికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మార్గంలో రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. .

నిషేధంతో అవస్థలు



రాత్రి వేళల్లో వాహనాల నిషేధంతో అట్లూరు, గోపవరం, సిద్దవటం, కాశినాయన బద్వేల్, పోరుమామిళ్ల తదితర మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చెక్‌పోస్టు తొలగించాలి.

- అతికారి వెంకటయ్య, సిద్దవటం.

అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు



ఫారెస్ట్ చెక్‌పోస్టు కారణంగా మండల కేంద్రం రాత్రి తొమ్మిది దాటితే నిర్మానుష్యంగా మారుతోంది. రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం అవసరమైతే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఆలోచించి చెక్‌పోస్టు తొలగించాలి.

- తిరుపతయ్య, ఎమార్పీఎస్ నాయకుడు, సిద్దవటం

చారిత్రక కట్టడాల పరిరక్షణకు చర్యలు

- సిద్దవటం కోటను సందర్శించిన పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్



సిద్దవటం కోటలో కందకాలను పరిశీలిస్తున్న మంత్రి కందుల దుర్గేశ్

సిద్దవటం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కట్టడాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పర్యాటక అధికారులతో కలిసి మంత్రి సిద్దవటం కోటను సందర్శించారు. మంత్రికి కడప జిల్లా జనసేన నేత అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చారిత్రక వారసత్వ కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మట్లిరాజులు నిర్మించిన అద్భుతమైన కోట సిద్దవటం కోట అన్నారు. అందులోని శివాలయం, మసీదులను పరిశీలించామని, సిద్దవటం కోట చుట్టూ ఉన్న దేవాలయాలను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల సహకారంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే ఈ ప్రాంతంలో సఫారీ బోటింగ్, రెస్టారెంట్ సర్క్యూట్ పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. సిద్దవటం కోటలోని శిథిలావస్థకు చేరుకున్న వాటికి మరమ్మతులు చేపడతామని తెలిపారు. అలాగే ఇక్కడికి వచ్చే పర్యాటకులు బస చేసి ఇక్కడి ప్రాంతాలను సందర్శించుకునే విధంగా అభివృద్ధి చేస్తామని తద్వారా స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాలోని గండికోటకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సహకారం అందించిందని అలాగే ఇతర ప్రాంతాల్లో కూడా సహకారాన్ని తీసుకుని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, వెల్నెస్ టూరిజలలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి చారిత్రక కట్టడాలకు పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఫారెస్ట్ చెక్‌పోస్టుతో పాటు మాచుపల్లె వంతెన నిర్మాణ విషయం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సిద్దవటం మండలంలోని పలు సమస్యలను మంత్రి దృష్టికి అతికారి కృష్ణ తీసుకెళ్లారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ముందుగా సిద్దవటం కోటలో పలు ప్రదేశాలను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖాధికారులు, కూటమి నేతలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం- బద్వేలు రోడ్డును అభివృద్ధి చేయాలి

సిద్దవటం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం - బద్వేల్ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రాజేష్ మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం సిద్దవటంలో పర్యటించిన రాష్ట్ర మంత్రికి ఈ మేరకు వినతిపత్రం అందజేశామని, గత వైసీపీ ప్రభుత్వంలో విస్తరణ పనులు ఆగిపోయాయని తెలిపారన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): పెన్షనర్ల పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ , ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రెడ్డికుమార్ మాట్లాడుతూ పోరా టాల ద్వారానే పెన్షనర్ల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కోశాధికారి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సంఘ నిర్మాణంతో పాటు భవిష్యత్తులో సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు నరసింహులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు పరిష్కా రం కావాలంటే పోరాటాలే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మహదేవ రాజు, భాస్కర్‌రెడ్డి, తదితర పెన్షనర్స్ పాల్గొన్నారు.

కాల్పుల ఘటనపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆరా..

రాయచోటి టౌన్, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని కాటిమాయ కుంటలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన కాల్పుల ఘటనపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆరాతీశారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. కాల్పుల ఘటనపై ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాల్పుల్లో గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసి కాల్పులు జరిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రాజంపేట టీడీపీలో సమస్యలు పరిష్కరించండి

రాజంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట టీడీపీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు, నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యంకు జరుగుతున్న అన్యాయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కడప జిల్లా పర్యటకు వచ్చిన మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్‌కు రాజంపేట టీడీపీ బలిజ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాజంపేట టీడీపీ నాయకులు గీతాం జలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, బలిజ సం ఘ జిల్లా యూత్ అధ్యక్షులు టైల్స్ నరసింహ, ఊటుకూరు చెరువు సంఘ అధ్యక్షుడు నామా హరినాథ్, అగ్రహారం నాయకులు చల్లా సుధాకర్‌బాబు, జనసేన పార్టీ నాయకులు అబ్బిగారి గోపాల్ కడపలో మంత్రులను కలిశారు. ఈ సందర్భంగా రాయలసీమ పరిధిలో బలిజ సామాజికవర్గం నుంచి సుగవాసి బాల సుబ్రమణ్యం ఒక్కరికే టీడీపీ టికెట్ లభించిందన్నారు. దీంతో టీడీపీలోని వైసీపీ కోవర్టులు, తెలుగుదేశంలోని కొందరు నాయకులు ఆయన గెలుపును అడ్డుకున్నారన్నారు. సుగవాసికి అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా అధికారులను బెదిరించి ఇబ్బందులుపాలు చేస్తున్నారన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రులు స్పందిస్తూ ఈ విషయా లను అధిష్టానం దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు.

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణోత్సవం



శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

పీలేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఏడు శనివారాల వ్రతం ముగింపు సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు స్వామి, అమ్మ వారికి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యు లు పాల్గొన్నారు. ం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

మురుగు నీటితో ప్రజలకు అవస్థలు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సిద్దవటం, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మిట్టపల్లి వాసులు మురుగునీటి నిల్వలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా రహదారిలో నీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయని, దీంతో విషజ్వరాలు సోకే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారిలో నడవడం కూడా కష్టంగా మారుతోందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించినీరు నిల్వలేకుండా చూడాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

జోరుగా.. ఇసుక అక్రమ రవాణా



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

సిద్దవటం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలకు మాత్రమే ఇసుక ఉచితంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చినా కొంతమంది అక్రమంగా ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె గ్రామాల నుంచి ప్రతిరోజు షాదీఖానా ప్రాంతంలోని మిట్ట మీదుగా బద్వేల్, కడప ప్రాంతాలకు తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. అధికారులు ఆ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కార్యకర్తలతో మాట్లాడుతున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

గాలివీడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కు కృషి చేస్తున్నామని మం త్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఆది వారం గుండ్లచెరువు, కొర్లకుం ట, తలముడిపి, పూలుకుంట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే రెండు కోట్ల యాభై లక్షల రూపాయలతో సిమెంటు రోడ్లు పూర్తయ్యాయని, త్వరలోనే సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం మరో మూడు కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యను నివారించడానికి బోర్లు వేయిస్తున్నామని తెలిపారు. గాలివీడు మండలంలో మంచినీటి సమస్య తీర్చడానికి ప్రతి గ్రామంలో బోర్లు వేయడంతో పాటు పైపులైన్లు నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. డ్రైనేజీ, రోడ్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టడంతో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తు న్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పూలుకుంట సర్పంచ్ పార్థసారథిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, మాజీ సర్పంచులు ఫరీద్‌బాషా, జగన్నాథరెడ్డి, మహమ్మద్‌రఫీ, గీదర ఈశ్వర్‌రెడ్డి, రైతు సంఘం కార్యదర్శి వెంకటశివారెడ్డి, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల తొలగింపు



చెత్త కుప్పలు తొలగిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న దళితవాడలో ఆరు నెలల నిర్లక్ష్యం శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం దళితవాడ ఇతర ప్రాంతాల్లో ఉన్న చెత్త కుప్పలను తొలగించారు.

రేపటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

రాజంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని ఎర్రబల్లి కోదండరామాలయంలో ఈనెల 24 నుంచి ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం రామాయణం,, 25న మహాభాగవతం, 26న భగవద్గీతపై ధర్మాచార్యుడు గంగనపల్లి వెంకటరమణ ధార్మికోపన్యాసం చేస్తారన్నారు. 27న ఉదయం కుంకుమార్చన, రాత్రి హిందూ ధర్మ ప్రచార పరిషత్తు కళాకారులతో హరికథ, 28న గ్రామస్థులతో భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త ఉల్లంగి నాగరాజు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కోరారు.

హైవేపై గుంతల పూడ్చివేత



పనులను పర్యవేక్షిస్తున్న ఎస్‌ఐ మహేష్

ఓబులవారిపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఉన్న హైవేపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు ఎస్‌ఐ మహేష్ ఆదివారం చర్యలు తీసుకున్నారు. లారీ యజమానుల సహకారంతో దగ్గరుండి పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో కార్మికుల పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాజంపేట, డిసెంబ రు 22 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాజంపేట పట్టణ కార్యదర్శి సికిందర్, ఏఐటీయూసీ నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేస్తున్నా పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం పని చేస్తామని నమ్మబలికి, ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద 15 వేల రూపాయలు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన డ్రైవర్లకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సురేష్, రమణ, శివ, ఫణి, మనోహర్, కోటి, శ్రీనివాసులు, మణి తదితరులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమపై ద్వేషంతోనే అల్లు అర్జున్ అరెస్ట్

- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు

రాజంపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినిమా పరిశ్రమపై ద్వేషంతోనే సినీ హీరో అల్లుఅర్జున్‌ను అరెస్ట్ చేశారని, ఆయన ఇంటిపై పోలీసులు అక్రమంగా దాడి చేశారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలనా వైఫల్యాలను పక్కదారి పట్టించుకునేందుకే తెలంగాణా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ విఫలమైన ప్రతిసారి ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడడం మామూలేనన్నారు. ఉద్దేశపూర్వకంగానే అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారన్నారు. సినిమా బెనిఫిట్‌షో రోజున అల్లుఅర్జున్ వస్తున్నాడన్న సమాచారాన్ని సంధ్య థియేటర్ యాజమాన్యం పోలీసులకు తెలియజేసిందని రేవంత్‌రెడ్డే తెలిపాడన్నారు. పోలీసులు సరైన భద్రత కల్పించలేక పోవడం వల్లే ఒక మహిళ చనిపోగా, ఆమె కుమారుడు తీవ్రగాయాలపాలయ్యాడన్నారు. పోలీసుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అల్లు అర్జున్ అరెస్ట్‌ను తాము తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు.

26న అనంతపురం గంగమ్మ జాతర హక్కుల వేలం

లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మ జాతర సందర్భంగా తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్‌గేట్ వసూలు, ఏడాదిపాటు ప్రతి ఆదివారం ఆలయం ముందు కొబ్బరికాయాలు, పూలదండల దుకాణాల ఏర్పాటుకు సంబంధించిన హక్కులకు ఈ నెల 26న దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఔత్సాహికులు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. హక్కులు దక్కించుకున్నవారు వేలం ముగిసిన వెంటనే సగం మొత్తం, మిగిలిన మిగిలిన మొత్తం పది రోజుల్లోపు చెల్లించాలని వివరించారు. హక్కులు దక్కని వారికి డిపాజిట్ సొమ్ము వాపసు చేస్తామన్నారు. వేలంలో హిందువులు పాల్గొనాలని తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 2 వరకు జాతర జరుగుతుందన్నారు.

అత్తారింటి నుంచి వెళుతూ...

చెరువుకట్టపై మినీ ట్రక్కు ఢీ - భార్యాభర్తలు మృతి


నరసింహ - సుజాత మృతదేహాలు

ఓబులవారిపల్లె, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అత్తారింటి నుంచి ఇంటికి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో కోలాటం నరసింహ(43), భార్య సుజాత(38) మృతి చెందారు. భువనగిరిపల్లె వాసులు నరసింహ దంపతులు అత్తారిళ్లు అయిన ఓబులవారిపల్లె మండలంలోని వై.కోట నుంచి స్వగ్రామం భువనగిరిపల్లెకు బైక్‌లో తిరిగి వస్తున్నారు. రెడ్డిపల్లె సమీప చెరువుకట్టపై అశోక లేలాండ్ మినీ వాహనం ఎదురుగా వచ్చి ఢీకొనడంతో నరసింహ అక్కడికక్కడే మృతిచెందాడు. అతని భార్య సుజాత, పాప, బాబు ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలు కాగా రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో ఆమె మృతిచెందినట్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం పిల్లలను తిరుపతికి తరలించారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. మృతుడు నరసింహ భువనగిరిపల్లెలో జనసేన పార్టీకి కీలక కార్యకర్తగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


వరుణ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. రైల్వేకోడూరులో ఆదివారం చోటు చేసుకున్న ఘటన వివరాల్లోకెళితే... రైల్వేకోడూరు మండలం రాఘవ రాజపురం దళితవాడకు చెందిన పైనం వరుణ్ (29) రైల్వేకోడూరులో చికెన్ తీసుకుని ఇంటికి వెళుతుండగా వెనక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వరుణ్ బంధువులు, తల్లిదండ్రులు, స్నేహితులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృత దేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వరుణ్‌కు ఏడాది కిందటే అపురూపతో వివాహమైందని తల్లిదండ్రులు సుబ్బరాయుడు, లక్ష్మీదేవి విలపించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నవీన్ బాబు తదితరులు తెలిపారు.

విద్యుదాఘాతంతో లారీ డ్రైవర్ మృతి


ఫరూక్ అహమ్మద్ మృతదేహం

లింగాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగ తెగి లారీ మీదపడడంతో విద్యుదాఘాతానికి గురై లారీడ్రైవర్ ఫరూక్ అహమ్మద్ మృతిచెందాడు. ఫరూక్ అహమ్మద్ స్వస్థలం శ్రీనగర్. అతను అరటి కాయలను లోడ్ చేసుకుని వెళ్లేందుకు ఆదివారం లింగాలకు వచ్చారు. ఫరూక్ అహమ్మద్ తన లారీని నీటితో శుభ్రంచేసుకునే సమయంలో పక్క పొలంలో మరో లారీ అరటికాయల కోసం వెళుతోంది. ఆ సమయంలో విద్యుత్ తీగలు గమనించకుండా లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో వైర్ లారీ క్యాబిన్‌కు తగిలి విద్యుత్ పోల్ పిన్ వద్ద బైండింగ్ వైర్ కట్ కావడంతో పైనున్న 11కేవీ విద్యుత్ లైన్‌కు తగలడం అదే సమయంలో ఫరూక్ అహమ్మద్ శుభ్రం చేసుకుంటున్న లారీమీద వైరు పడడంతో విద్యుత్ ప్రవాహం జరిగి షాక్‌కు గురై ఫరూక్ అహమ్మద్ కిందపడిపోయాడు. వెంటనే చికిత్స కోసం పులివెందులకు తరలించగా అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు వెల్లడించారు.

వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధన

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవాలు ఆదివారం వైభవంగా మఠాధిపతి వీర శివకుమారస్వాముల ద్వారా ప్రారంభమయ్యాయి. వేకువ నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, రాత్రి కలశోత్సవం, కలశ స్థాపన, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఉదయం 5గంటలకు మఠాధిపతి, దంపతుల చేత ఈశ్వరీమాత ధార్మిక భవనం ప్రారంభోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 27 వరకు ఆరాధన గురుపూజా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భయం.. భయం..

- కనుగొండ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం
- సమీప గ్రామాల్లో తీవ్ర భయాందోళన
- అడవి వైపు వెళ్లని కాపరులు
- మరోసారి చిరుత ప్రత్యక్షం


చిరుత పులి సంచరిస్తున్న కనుగొండ అటవీప్రాంతం

ములకలచెరువు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండలం పెద్దపాళ్యం సమీపంలోని కనుగొండ రిజర్వు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచారంతో తీవ్ర భయందోళన నెలకొంది. రెండు రోజుల కిందట అటవీ ప్రాంతంలో మేకల గుంపుపై చిరుతపులి దాడి చేయడంతో ఐదు మేకల జాడ కన్పించకపోవడం, మరో మేక మృతి చెందడం, మరొకటి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. కాపరిపై కూడా చిరుతపులి దాడి చేసేందుకు ప్రయత్నించడం, తోడుగా ఉన్న కుక్కల సహాయంతో కాపరి పాళ్యం నరసింహులు ప్రాణాలతో బయటపడడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో కనుగొండ అటవీ ప్రాంతానికి అతి దగ్గరలో ఉన్న కొండ కింద రైల్వేగేటు వద్ద శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో వస్తున్న ఇద్దరు యువకులకు చిరుత పులి మళ్లీ కన్పించిందని గ్రామాల్లో ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న గ్రామాల్లో తీవ్ర అలజడి నెలకొంది. కనుగొండ అటవీ ప్రాంతానికి చుట్టుపక్కల సమీపాల్లో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం, అంగజాలపల్లె, శివరాంపల్లె, మావిళ్లవారిపల్లె, గోళ్లపల్లె, అడివిచెరువు తదితర గ్రామాల ప్రజలకు చిరుతపులి భయం పట్టుకుంది. ముఖ్యంగా మేకల మందపై డాడి చేసిన పెద్దజారు బండ సమీపంలో ఉన్న తుంగపల్లె, పెద్దపాళ్యం గ్రామాల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. సాయంత్రం ఇంటి నుంచి బయటకు రావడానికి కూడా జంకుతున్నారు.


కనుగొండ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న తుంగపల్లె గ్రామం

అటవీ శాఖాధికారులపై ఆగ్రహం

చిరుతపులి కన్పించిన రోజు నుంచి అటవీ శాఖాధికారులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరుత పులి కన్పించిందని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇస్తే తూతూ మంత్రంగా వచ్చి విచారించి వెళ్లారని అంటున్నారు. చిరుతపులి భయం పోగొట్టేందుకు కనీసం కనుగొండ అటవీప్రాంతం సమీప గ్రామాల్లో అవగాహన కూడా కల్పించడం లేదని విమర్శిస్తున్నారు. చిరుతపులి కన్పించిన చోటికి ఇంతవరకూ వెళ్లలేదని, పెద్దపాళ్యం గ్రామంలోకి గురు, శుక్రవారం మాత్రం వచ్చి వెళ్లారని చెబుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు చిరుతపులి మేకల గుంపుపై దాడి చేసిన పెద్దజారుడుబండ వద్దకు వచ్చి పాదముద్రలు పరిశీలించి సమీప గ్రామాల్లో భయం పోగొట్టాలని పలువురు కోరుతున్నారు.

అడవి వైపు కన్నెత్తి చూడని గొర్రెలు, మేకల కాపరులు

చిరుతపులి దాడి చేసిన రోజు నుంచి గొర్రెలు, మేకల కాపరులు అడివివైపు వెళ్లడానికి భయపడుతున్నారు. అడివికి సమీపంలోని చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 60 మంది వరకు కాపరులు గొర్రెలు, మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సుమారు ఐదు వేల నుంచి ఆరు వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీరందరూ అడివిని నమ్ముకుని ప్రతిరోజూ గొర్రెలు, మేకలు తోలుకెళ్లి మేపుకొచ్చేవారు. చిరుతపులి కన్పించినప్పటి నుంచి అడవిలోకి వెళ్లడానికి సాహసించడం లేదు. గ్రామాలకు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల వద్దకు తోలుకెళ్లి మేపుతున్నారు. అడవిని నమ్ముకుని జీవిస్తున్న తమకు చిరుతపులి వల్ల భయం నెలకొందని, పరిస్థితి ఇలాగే ఉంటే గొర్రెలు, మేకలను అమ్ముకుని వలస వెళతామని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


రక్తం మరిగిన చిరుతపులి గ్రామాల్లోకి వస్తుందేమో..



మా గ్రామానికి దగ్గరలో ఉన్న కనుగొండ అడవిలో చిరుత పులి కన్పించింది. మేకలను చంపి తిని చిరుతపులి బాగా రక్తం మరిగింది. ఇప్పుడు గొర్రెలు, మేకలు అడవికి తోలుకెళ్లకపోవడంతో ఆహారం లేక రక్తం మరిగిన చిరుతపులి సమీప గ్రామాల్లోకి వచ్చే అవకాశం ఉంది. సాయంత్రమైతే ఇంటి నుంచి బయటకు రావడానికి భయమేస్తోంది. అటవీ శాఖాధికారులు చిరుతపులి ఎక్కడుందో కనుగొని రాత్రివేళల్లో గ్రామాల్లో గస్తీ తిరగాలి.

- మల్లెల వెంకటరమణ, తుంగపల్లె

27 మేకలను తినేసింది..



చిరుతపులి ఇప్పటివరకు 27 మేకలను తినేసింది. మేకలను మేపుకొచ్చేందుకు కనుగొండ అటవీ ప్రాంతంలోకి తోలుకెళ్లేవాడిని. దీపావళి పండగ నుంచి చిరుతపులి మేకలను పట్టుకుని వెళ్లి తినేసింది. మేకలు ఎక్కువగా ఉండడంతో గమనించుకోలేదు. మేకలు 120 ఉండేవి. ఇప్పుడు వందే ఉన్నాయి. నా కళ్ల ముందరే చిరుతపులి దాడి చేసి ఐదు మేకలను ఎత్తుకెళ్లింది. మరొకటిని చంపి ఒక మేకను గొంతు దగ్గర నోటితో పట్టుకుని గాయపరిచింది. నా పైనా కూడా దాడి చేసేందుకు వస్తుండగా నా వెంట ఉన్న కుక్కలు గట్టిగా అరవడంతో వెళ్లిపోయింది.

- పాళ్యం నరసింహులు, మేకల కాపరి

అక్షరాల శక్తిని చాటి చెప్పిన సన్నపురెడ్డి

సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి


సన్నపురెడ్డికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

కడప కల్చరల్, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): అక్షరాలకున్న శక్తిని తన సాహిత్యం ద్వారా చాటి చెప్పిన కథా, నవలా రచయిత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి అని ప్రముఖ సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు. కేతు పేరు మీద సన్నపురెడ్డికి అవార్డు మేలుకలయిక అన్నారు. ఇద్దరి మధ్య ఒక తరం అంతరం వున్నా అంతరాన్ని పూర్తి చేసుకుంటూ సన్నపురెడ్డి సాహిత్యం సృజిస్తున్నారన్నారు. కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీపీబ్రౌన్ గ్రంథాలయంలో కేతు స్మారక జీవన సాఫల్య పురస్కార సభ ప్రసిద్ధ కథా రచయిత దాదా హయాత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, వారి సతీమణి దుర్గాకుమారి, డీఆర్‌ఓ విశ్వేశ్వరనాయుడు ద్వారా అవార్డును సన్నపురెడ్డికి అందజేశారు. ప్రధాన వక్త మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కథ, కథనానికి మధ్య తేడా అర్థం కావాలని, అప్పుడే ఈ కాలపు కథ అర్థం అవుతుందన్నారు. నిదుర పుచ్చేది కథ అయితే జాగృతం చేసేది కథానిక అవుతుందన్నారు. అలా చూసినపుడు సన్నపురెడ్డి రాసింది కథానికలన్నారు. ప్రపంచాన్ని ప్రేమించాలంటే చాలా వదులుకోవాల్సి వుంటుందన్నారు. ముందుగా మనలో దాగివున్న కులహంకారాన్ని, మతాహంకారాన్ని వదులుకోవాలన్నారు. సన్నపురెడ్డి రాసిన చాలా కథలు అవే చెబుతాయన్నారు. ఆయన రాసిన 'చనుబాలు' కులహంకారాన్ని కూలగొట్టే కథ అన్నారు. మనిషిలోని సంఘర్షణను చిత్రించాలంటే గొప్ప మనసు కావాలన్నారు. ఆ మనసు సన్నపురెడ్డికి వుంది కాబట్టే గొప్ప సాహిత్యం రాశారన్నారు. కథానిక నిర్మించడంలో ఆయన గొప్ప పనితనం చూపారన్నారు. ఒక్క పదం కానీ ఒక్క వాక్యం కూడా వృధాగా వుండదన్నారు. ఎవరి గురించి చెబుతున్నారో ఆ జీవితం పదాల్లో కనబడుతూ వుంటుందన్నారు. కథల్లో పాత్రలను ఆయన రూపకల్పన చేస్తే అది మంచి కథల కోవలోకి రాదన్నారు. కథలో మెసేజ్ పాత్రల స్వభావాల ద్వారా చెబుతారన్నారు. ఆయన కథలు చదువుతున్నట్లు కాక చూస్తున్నట్లు వుంటాయన్నారు. అలా రాయాలంటే గొప్ప పరిణితి కావాలన్నారు. పురస్కార గ్రహీత సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తన స్పందనను తెలియజేస్తూ కేతు విశ్వనాథరెడ్డితో తనకున్న సాహిత్య వ్యక్తిగత అనుబంధాన్ని పంచుకున్నారు. రాసిన కథలు, కథనాలను మెచ్చుకుని భుజం తట్టి ప్రోత్సహించడంతో తాను కథలు రాసినట్లు వెల్లడించారు. కథా రచయిత శశికళ, వైవీయూ పాలకమండలి సభ్యుడు మూల మల్లికార్జునరెడ్డి, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తి, అభ్యుదయ చైతన్యవేదిక జిల్లా అధ్యక్షుడు చీపాటి రాజేశ్వరరావు, కేతు కుమారులు శశికాంత్, కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

బలిజ సమావేశంలో వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్


ప్రసాద్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్

కడప ఎన్జీఆర్ సర్కిల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడపలో ఆదివారం నిర్వహించిన కాపు, బలిజ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. జిల్లా బలిజ సంక్షేమ సంఘం పిలుపు మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బలిజలు తరలివచ్చారు. సమావేశంలో మంత్రులు వేదిక మీదకు వస్తుండగా పోరుమామిళ్లకు చెందిన రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్త రాళ్లపల్లె ప్రసాద్ కిందపడిపోయాడు. అతన్ని వెంటనే చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అతనికి బ్రెయిన్‌స్ట్రోక్ తగిలినట్లు చెప్పారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. రాయలసేవా సమితి సభ్యుడు, జనసేన కార్యకర్తరాళ్లపల్లె ప్రసాద్ కుటుంబం పేదరికంలో ఉండడంతో ఆ కుటుంబానికి సహాయం చేయాలంటూ పలువురిని అభ్యర్థించారు.

పేదలకు అండగా 'లేవాకు నారపురెడ్డి ట్రస్ట్'


పేదలకు ధాన్యం పంచుతున్న లేవాకు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రామరాజుపల్లె, పబ్బాపురం, రామచంద్రాపురంలో దాదాపు రెండెకరాల్లో పండించిన 80బస్తాల వరి ధాన్యాన్ని లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి, వైస్ ఛైర్మన్ లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి పేదలకు పంచిపెట్టారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ 2007 నుంచి తమ పొలంలో పండించిన పంటను పేదలకు పంచిపెడుతున్నట్లు చెప్పారు. నిరంతరం పేద ప్రజల కోసం లేవాకు చారిటబుల్ ట్రస్ట్ కృషి చేస్తోందన్నారు. అలాగే వేసవి కాలంలో కడప వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఇలా ఎన్నో సేవా కార్యక్రమాల్లో లేవాకు చారిటబబుల్ ట్రస్ట్ సేవ చేస్తూ అందరి మన్ననలు పొందతున్నామన్నారు.

మనుషుల్లో మానవత్వం వెల్లివిరియాలి : వీసీ



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న ఇన్‌టాక్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మనుషుల్లో మానవత్వం వెల్లివిరిసినపుడే సమాజం సుఖశాంతులతో ఉండగలదని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య విశ్వనాథకుమార్ అన్నారు. ఆదివారం ఇన్‌టాక్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల ప్రేమ దయ క్షమాగుణం కలిగి ఉండాలని దైవ గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయన్నారు. ఇన్‌టాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడమే ధ్యేయమన్నారు. మన్సూర్ అలీఖాన్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ పూర్వ ప్రెసిడెంట్ పోతుల వెంకటరామిరెడ్డి, డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, ఇన్‌టాక్ పూర్వ కన్వీనర్ ఇలియాస్ రెడ్డి, రాజశేఖర్ రాహుల్, గౌరీశంకర్, పాస్టర్ విజయ్‌కిషోర్ మాట్లాడారు. పాస్టర్ విజయ్‌కిషోర్ పర్యవేక్షణలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. శ్రీనివాసులు, కొండారెడ్డి, గంగాధర్, సంపత్‌కుమార్, వెంకటసుబ్బారెడ్డి, వేణుగోపాల్, సంజీవరెడ్డి, నాగవేణి, పార్వతి పాల్గొన్నారు.

రూ.13.19 కోట్లతో వసతిగృహాల మరమ్మతులు

- జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్


పీలేరులో ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్

పీలేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 43 ప్రభుత్వ వసతి గృహాలకు రూ.13.19 కోట్లతో మరమ్మతులు చేస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జయప్రకాశ్ తెలిపారు. పీలేరులోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గృహాల్లో అనేక సమస్యలు ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి పనులను చేపడతామన్నారు. అందులో భాగంగా జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని తొమ్మిది వసతి గృహాలకు రూ.2.40 కోట్లు, రాజంపేట నియోజకవర్గంలోని ఆరు వసతి గృహాలకు రూ.1.93 కోట్లు, రాయచోటి నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.3.02 కోట్లు, మదనపల్లె నియోజకవర్గంలోని మూడు వసతి గృహాలకు రూ.78 లక్షలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఒక వసతి గృహానికి రూ.10 లక్షలు, పీలేరు నియోజకవర్గంలోని 12 వసతి గృహాలకు రూ.4.97 కోట్లు మంజూరైనట్లు ఆయన వివరించారు. వసతి గృహం వంటశాల, డార్మిటరీ, మరుగుదొడ్లు, నీటి వసతిని పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్లను తొలగించిన కొత్త వాటిని నిర్మిస్తామని, ఉరుస్తున్న డార్మిటరీ పైకప్పును మారుస్తామన్నారు. త్వరలోనే ఇంజనీరింగ్ శాఖాధికారులతో మరోమారు వసతిగృహాన్ని సందర్శిస్తామన్నారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, బోదేషావలి, వసతి గృహ వార్డెన్లు రమాదేవి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణతో ఆత్మస్థైర్యం : వీసీ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జ్ఞానంతో పాటు శారీరక మానసిక వికాసం ఆత్మస్థైర్యం గల యువత తయారు కావాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వర్సిటీ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత విద్యార్థినులకు రెండో విడత శిక్షణను ఇవ్వనున్నామని ప్రకటించారు. నైపుణ్యతను అవసరమైన సందర్భంలో ధైర్యంగా ఉపయోగించుకోవాలన్నారు. పీజీ కళాశాల ప్రధానాచార్యులు, హాస్టళ్ల చీఫ్ వార్డన్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ చదువులు సాగించాలని దేశానికి విలువైన వనరుగా మారాలన్నారు. అనంతరం శిక్షణ నిపుణులు నాగూర్ బాబును సత్కరించారు.

రూ. కోటి విలువైన ప్రభుత్వ స్థలం కబ్జా

- 20 అడుగుల స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు
- పనులు నిలిపివేయించిన పోలీసులు


ఆక్రమించి పనులు చేస్తున్న దృశ్యం - స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ నవీన్‌బాబు

రైల్వేకోడూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): శ్రీలక్ష్మీపార్వడైజ్ సినిమా హాలుకు సమీప ప్రధానదారికి పక్కనే ప్రభుత్వ స్థలాన్ని ఖద్దరు బాబుల అండతో ఆక్రమించి భవన నిర్మాణాలు చకచకా జరిగిపోతున్నాయి. నిర్మాణం జరుగుతున్న 20 అడుగుల స్థలం రూ. కోటి విలువ చేస్తుంది. ఆక్రమణదారుడు ఎవరు వచ్చినా ఏమీ చేయలేరని బహిరంగంగా నిర్మాణాల వద్దకు వచ్చిన వారిపై దౌర్జన్యం చేస్తున్నాడు. స్థానికులు నేషనల్ హైవే అథార్టీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో కొన్ని రోజుల పాటు పనులు నిలిపి వేశారు. ఖద్దరు బాబులు రంగప్రవేశం చేసి ఎవరు ఏమనుకున్నా పర్వాలేదు పనులు చేసుకోమని చెప్పడంతో ఆక్రమణదారుడు పనులు చకచకా చేపట్టాడు. ఆదివారం అందిన సమాచారం మేరకు రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు తన సిబ్బందితో ఆక్రమణ నిర్మాణాలను పరిశీలించారు. వెంటనే పనులు నిలుదల చేయాలని ఆక్రమణదారుడిని హెచ్చరించారు. కోడూరులో కబ్జాల పర్వం పరిపాటిగా మారుతోంది. ఖద్దరు అండతోనే కబ్జాలు సాగుతున్నాయి. కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఎవరైనా అడ్డుకున్నా వారిపై దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు దృష్టికి తీసుకెళ్లగా లక్ష్మీపార్వడైజ్ సినిమా థియేటర్ వద్ద ప్రధానదారిపై నేషనల్ హైవే అథార్టీ అధికారి నారాయణ నాయక్ వచ్చి ఆక్రమణలు ఆపాలని తమకు విన్నవించారని తెలిపారు. ఆ మేరకు ఆక్రమణ నిర్మాణాలను ఆపామని తెలిపారు. మళ్లీ ఆక్రమణ పనులు జరుగుతున్నాయని సమాచారం రావడంతో తన సిబ్బంది వెళ్లి పనులు నిలుపు చేయించారని తెలిపారు. నేషనల్ హైవే అథార్టీ అధికారులు ఫిర్యాదు ఇస్తే వెంటనే కేసు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన వివరించారు.

హెల్మెట్ బరువు కాదు.. ప్రాణాలకు రక్ష



లక్ష్మన్న
సీఐ, ములకలచెరువు

ములకలచెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ బరువు కాదని..ప్రాణాలకు రక్షణ ఇస్తుందని ములకలచెరువు సీఐ లక్ష్మన్న పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించేలా తప్పనిసరి చేశాం. దీనిపై వాహనదారులకు ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నాం. జాతీయ రహదారిలో తనిఖీలు నిర్వహిస్తూ అధిక వేగానికి కళ్లెం వేస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడి పే వారికి జరిమానాలు విధిస్తున్నాం.

ప్రశ్న: ములకలచెరువులో ట్రాఫిక్ సమస్య అధిగమించేందుకు ఏమి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ములకలచెరువులో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే బస్టాండు సర్కిల్‌లో ప్రతి రోజూ సిబ్బందిని ఉంచుతున్నాం. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచారా?

జవాబు: ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశాం. ఇసుక రవాణాపై నిఘా ఉంచాం. ప్రభుత్వ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఇసుకను ట్రాక్టర్లతో మాత్రమే తోలుకోవాలి. యంత్రాలతో తోడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై చర్యలేమి?

జవాబు: కర్ణాటక నుంచి మద్యం ఇక్కడి రాకుండా చర్యలు ముమ్మరం చేశాం. గతంలో కర్ణాటక మద్యం తరలించి పట్టుబడ్డ నిందితులపై నిఘా ఉంచాం.

ప్రశ్న: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తున్నారా?

జవాబు: సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. పెండింగ్ పెట్టుకోవద్దని ఎస్‌ఐలకు ఆదేశాలు జారీ చేశాం. సమస్యలపై నిర్భయంగా పోలీస్‌స్టేషన్లకు రావచ్చు. లేదంటే నేరుగా నన్ను కలవవచ్చు.

ఆరెమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆరెమ్మ అమ్మవారు

తంబళ్లపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల కేంద్రంలోని సిద్దారెడ్డిగారిపల్లెలో వెలసిన నాయీ బ్రాహ్మణుల కులదేవత ఆరెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా డిసెంబరు నెలలో నాయీ బ్రాహ్మణుల కుటుంబాలలోని పురుషులు ఆరెమ్మ అమ్మవారికి దీలూ, బోణాలూ సమర్పించి పూజలు నిర్వహిస్తారు. ఆదివారం నాయీ బ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో దీలూ, బోణాలను కాలినడకన ఊరేగింపుగా తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రజలందరూ సఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

గాండ్ల తెలికుల యువజన కన్వీనర్‌గా ఉదయ కుమార్



పీలేరు, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): అఖిల భారత గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా యువజన విభాగం కన్వీనర్‌గా పీలేరుకు చెందిన తరిగొండ ఉదయ కుమార్ ఎన్నికయ్యారు. నెల్లూరులో ఆదివారం జరిగిన ఆ సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర నాయకులు ఉదయ కుమార్ ఎన్నికను ప్రకటించారు. ఈ సందర్భంగా ఉదయ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను అన్నమయ్య జిల్లా కన్వీనర్‌గా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండపల్లె వెంకటరమణ, ఎంవీ రమణలకు కృతజ్ఞతలు తెలిపారు. వారు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా గాండ్ల కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. యువజన కన్వీనర్‌గా ఎన్నికైన ఆయనను ఆదివారం పలువురు అభినందించారు.

ఆర్భాటం తప్ప.. ఆచరణ శూన్యం

●గత వైసీపీ నిర్వాకంతో అరకొర పనులు పూర్తికాక ఆగిన సచివాలయ భవనాలు ● బిల్లుల జాప్యంతోనే సమస్యలంటున్న నిర్మాణదారులు



పెద్దమండ్యంలో అరకొర పనులు పూర్తికాక ఆగిపోయిన గ్రామ సచివాలయం

పెద్దమండ్యం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) గత వైసీపీ ప్రభుత్వ ప్రచార ఆర్భాటం తప్ప ఆచరణలో చాలా పనులు చేపట్టకపోవడంతో లక్షల్లో ప్రజాధనం దుర్వినియోగంగా మారింది. ఇందుకు నిదర్శనం వైసీపీ ఏర్పాటు చేసిన సచివాలయ భవనాలే కారణం. లక్షలు వెచ్చించి భవన నిర్మాణాలు చేపట్టిన చివరకు సకాలంలో సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో భవన నిర్మాణదారులు వాటిని అలాగే వదలివేయడంతో అవి నిరుపయోగంగా ఉంటూ వెక్కిరిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. పెద్దమండ్యం మండలంలో 17 గ్రామ పంచాయతీలకు గాను 11 గ్రామ పంచాయతీల్లో గ్రామ సచివాలయాలు. 11 రైతు భరోసా కేంద్రాలు, 7 గ్రామీణ ఆరోగ్య కేంద్రాల కొత్త భవన నిర్మాణ పనులను ఆర్భాటంగా చేపట్టింది. ఒక్కొక్క భవనాకి రూ. 35 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో పెద్దమండ్యం, పాపేపల్లి, సి.గొల్లపల్లి, ముసలికుంట, కలిచెర్ల, ఎన్‌వోపల్లి, కోటకాడపల్లి, బండ్రేవు, సిద్దవరం, వెలిగల్లు, బండమీదపల్లి గ్రామ సచివాలయాలున్నాయి.కానీ ఏ ఒక్క చోట కూడ కొత్త సచివాలయ భవనాల్లో పరిపాలనకు నోచుకోలేదు. 7 గ్రామీణ ఆరోగ్యకేంద్రాలకు గాను ఒక గ్రామీణ ఆరోగ్య కేంద్రం తుది దశ పనుల్లో ఉంది. మండలంలో పలు చోట్ల గ్రామాలకు దూరంగా సచివాలయ భవన నిర్మాణాలు చేపట్టడడంతో అప్పట్లో ఆయా ప్రాంతాల్లో ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టినట్లు అప్పట్లో తీవ్రఆరోపణలు వచ్చాయి. డివిజన్ స్థాయిల్లో అభివృద్ధి పనుల పర్యవేక్షణకు(డీఎల్‌డీవో) ప్రత్యేక అధికారులను కేటాయించిన అభివృద్ధి పనుల పురోగతి లేకుండా పోయింది. అభివృద్ధి పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జాప్యం జరగడంతో కాంట్రాక్టర్లు తటస్థత స్థితిలో ఉండిపోయారు. కాగా బండ్రేవు గ్రామ సచివాలయం పరిధిలోకి మందలవారిపల్లి, అవికేనాయక్‌తాండ, దిగువపల్లి గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మూడు గ్రామ పంచాయతీల ప్రజలు బండ్రేవు సచివాలయంలో వివిధ పత్రాలు దరఖాస్తుల కోసం 5 లేక 6 కిలోమీటర్లు నడుచుకుంటు వెళ్లాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అలాగే శివపురం గ్రామ ప్రజలు 4 కిలో మీటర్లు నడిచి సిద్దవరం గ్రామ సచివాలయానికి పోవాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిధుల కోసం ప్రతిపాదన పంపించాం

అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణాలకు నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాం. అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం నిధులు ఇస్తుందని ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌వోపల్లి ఆర్‌బీకే బిల్లుల కోసం ప్రతిపాదన పంపించాం. నిధులు విడుదల అయిన వెంటనే భవనాల అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం.

-ఫేక్ షావాజ్ బాష, పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ, పెద్దమండ్యం మండలం

డాక్యుమెంటు రైటర్లను ఇబ్బందులు పెట్టొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్యుమెంట్ రైటర్ల సంఘం అధ్యక్షుడు

మదనపల్లె, డిసెంబరు 22: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న డాక్యు మెంటు రైటర్లను ఇబ్బందులకు గురి చేయవద్దని దస్తావేజులేఖకుల సంఘం అధ్యక్షుడు రంగు గుణశేఖర్ పేర్కొన్నారు. మదనపల్లెలో ఆదివారం ఆసంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకు సిబ్బంది వచ్చి సబ్‌రిజిస్ట్రార్ అధికారులు, సిబ్బందితో ఒప్పందం కుదుర్చుకుని డైరెక్ట్‌గా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు వాపోయారు. దీంతో కొన్నేళ్లుగా ఇదే వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న తాము జీవనోపాధి కోల్పోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. 15ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్న వారు కొనసాగుతూ వారి వద్ద సహాయకులుగా పని చేస్తున్న వారి ని కూడా కమిటీలో చేర్చుకునే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. చట్టానికి, నిబంధనలకు లోబడి ఉన్న డాక్యుమెంట్లను మాత్రమే రాయాలని తేల్చిచెప్పారు. సమావేశంలో రైటర్లు ఎస్.చిన్నసాయి, తాళ్ల జయచంద్రనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, హరిబాబునాయుడు, ఎస్.శ్రీనివాసులునాయుడు, ఎం.చంద్రశేఖర్‌రావు, గజేంద్ర, గణేష్‌స్వామి, రెడ్డెప్ప, నూర్ అహ్మద్, హామీ అహ్మద్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రంగు గుణశేఖర్, గౌరవాధ్యక్షుడిగా రంగు రాజేంద్ర, ఉపాధ్యక్షునిగా మంచినీళ్ల నాగమునీంద్ర, కార్యదర్శిగా కంగేరి నందా, సంయుక్త కార్యదర్శిగా జి.రెడ్డెప్ప, ట్రెజరర్‌గా మహ్మద్‌ఖాన్(లవానీ బాబు), కార్యవర్గ సభ్యులుగా కరూర్ వెంకటేష్, ఎస్.పెద్దసాయి, మచ్చా నారాయణ, నవీన్‌కుమార్, ఎ.శివరామయ్యగుప్త, జి.శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కారు ఢీకొని బాలుడు మృతి

● తల్లడిల్లిన తల్లిదండ్రులు

గుర్రంకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఆ బాలుడు పది నిమిషాల కిందట వరకు తల్లిదండ్రులతో ఆడుకొంటూ తనకు తినుబండారాలు కావాలంటూ మారాం చేశాడు. దీంతో తల్లిదండ్రులు కొంత సొమ్మిలిచ్చి పక్కనే ఉన్న అంగడిలో బిస్కెట్‌లు తీసుకోవాలని పంపారు. బాలుడు తినుబండారాలను తీసుకొని రోడ్డు పక్కనే ఆడుకొంటుండగా మృత్యువు కారు రూపంలో కభళించింది. కొడుకు రోడ్డుపై ఎగిరిపడి మృతి చెందడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. పోలీసుల వివరాల మేరకు బీహార్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ ఖరీమ్ హుస్సేన్ భార్య పిల్లలతో కలిసి గుర్రంకొండ పంచాయతీ గాజులవారిపల్లె సమీపంలోని ఓ కోళ్ల పారంలో పని చేస్తున్నారు. కాగా వారి కుమారుడు మహ్మద్ హుస్సేన్(3) కడప-బెంగుళూరు జాతీయ రహదారి పక్కనే ఆడుకొంటుండగా కడప నుంచి బెంగుళూరు వైపు వెళ్లుతున్న కారు బాలుడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహ్మద్ హుస్సేన్ ఎగిరిపడడంతో తలకు తీవ్ర రక్తగా యమైంది. దీంతో బాలుడిని గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి పరీక్షిం చగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు మృతి చెందిన బాలుడ్ని ఒడిలో ఉంచుకొని బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):బస్సు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం, చీర్లగడ్డకు చెందిన కృష్ణప్ప కుమారుడు రవి(35), లోకేష్(28)లు తిరుమలకు బైకుపై వెళ తుండగా వాయల్పాడు మండలం విఠలం సమీపంలో తిరుపతి నుంచి వస్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో రవికి కాలు విరిగిపోగా లోకేష్‌కు గాయలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు.

మరో ప్రమాదంలో యువకులకు గాయాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు22: పుంగనూరు రోడ్డులోని రెస్టారెంట్‌కు వెళ్లి వస్తుండగా బస్సును తప్పించబోయి రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ఆదివారం మదనపల్లె పట్టణం అమ్మచెరువు మిట్టకు చెందిన నారాయణ కుమారుడు నిఖిల్ (20)కురబలకోట మండలం, ముదివేడు గ్రామం దాదావారిపల్లెకు చెందిన ఇర్ఫాన్(20) ఇద్దరు కలిసి బైక్‌పై పుంగనూరు రోడ్డులో ఓ రెస్టాంట్‌లో భోజనం చేసి తిరుగు ప్రయాణంలో బస్సును తప్పించబోయి అదుపు కిందపడ్డారు. ఈ సంఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఇర్ఫాన్ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా నిఖిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జీవితం మీద విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య



బాలసుబ్రమణ్యం మృతుడు

ములకలచెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీవితం మీద విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు..చిత్తూరు జిల్లా గంగవరంకు చెందిన గజ్జల బాలసుబ్రమణ్యం(31) ములకలచెరువు మండలం కాలువపల్లె సమీపంలోని కోళ్ళఫారంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఇతనికి భార్య నవనీత, ఇద్దరు కుమారులు హేమంత్, లోకిత్‌లు ఉన్నారు. అప్పులు ఎక్కువగా ఉండడంతో జీవితం మీద విరక్తి చెంది కోళ్ళఫారంలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నరసింహుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దు

ములకలచెరువు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని ఎస్‌ఐ నరసింహుడు సూచించా రు. ములకలచెరువులో ఆదివా రం ద్విచ క్రవాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వానాలిస్తే కుటుం బీకులపై చర్యలు తప్పవన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి జరిమానాలు విధించారు.

29న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణపై సమావేశం

పీలేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సన్నాహాల కోసం ఈ నెల 29న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తారక రామా రావు విజ్ఞాన కళాక్షేత్రం అధ్యక్షుడు ఎన్టీఆర్ నఫీస్ తెలిపారు. పీలేరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణ స్థలం కోసం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని కలిసి కోరగా అనువైన స్థలం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాస కల్యాణోత్సవం



పీలేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరులోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో ఆదివారం శ్రీనివాస కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఏడు శనివారాల వ్రతం ముగింపు సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ గ్రేటర్, వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. తిరుపతి నుంచి వచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులు స్వామి, అమ్మవారికి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కళ్యాణం జరిపించారు. అత్యంత శాస్త్రోక్తంగా జరిగిన కల్యాణోత్సవంలో స్థానిక ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగునాడు విద్యుత్ సంఘ కార్యవర్గం ఎన్నిక



పీలేరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పీలేరులో ఆదివారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో పీలేరు డివిజనల్ అధ్యక్షుడిగా గురుశంకర్, కార్యదర్శిగా పూల రెడ్డప్ప, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వి.శ్రీనివాసులు, అదనపు అధ్యక్షుడిగా ఆరిఫుల్లా, అదనపు కార్యదర్శిగా టి.రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రెడ్డిబాషా, కోశాధికారిగా ఎంవీ గంగాధర్ ఎన్నికయ్యారు. పీలేరు డివిజన్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఎం.డీ.రఫీ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో తెలుగునాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుగుణాకర్, డిస్కం ప్రాంతీయ, డివిజనల్ నాయకులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన వారిని పలువురు అభినందించారు.

గణిత బ్రహ్మ శ్రీనివాసరామానుజన్



రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గురుప్రసాద్, అధ్యాపకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 22(ఆం ధ్రజ్యోతి): గణిత బ్రహ్మ శ్రీనివాస రామానుజన్ అని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్ర సాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, అధ్యాపకుడు ఉదయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గురువులకు సన్మానం



మదనపల్లె అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాకు స్థాధించడానికి కృషి చేసిన గురువులకు ఆదివారం స్థానిక శ్రీ చైతన్య స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ ఏజీఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం ఆర్ఐ శ్రీధర్‌ను, ఉపాధ్యాయులను దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫీ, విజయలక్ష్మీ, డీన్ అనిల్, నూర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమ్మేళనం అభినందనీయమని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. బెంగళూరులోని బెల్లందూరులోని ఐకాన్ ప్రీమియర్ హోటల్‌లో మిట్స్ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ కళాశాల విద్యార్థుల భవిష్యత్ కోసం ఎంతో కృషి చేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం సాయంత్రం కేక్ కట్ చేసి సంబరాలను ముగించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ హెడ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ కళాశాలను యూనివర్సిటీ చేయాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని బీటీ కళాశాలను యూనివర్సిటీ చేసి పనులు ప్రారంభించాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో వైభవంగా గొప్ప వక్తలకు విద్యను అందించిన బిటీ కళాశాల ప్రస్తుతం మరుగున పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సహదేవ, రమణ, శ్రీనాథ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివ, ప్రశాంత్, మహేస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ రజతోత్సవం

మదనపల్లె అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):సీనియర్ సిటిజన్స్ రజతోత్సవాన్ని ఆదివారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఉత్తమ సేవలను అందించిన సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం చేశారు. ఇందులో అన్నమయ్యజిల్లా అధ్యక్షుడు ఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణకు, ఏపీ ప్రివిలేజ్ కమిటీ సభ్యురాలు ధనలక్ష్మీకు, దుశ్శాలువ కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌కు మునిగోపాకృష్ణ చేసిన సేవలను కొనియాడారు.

రూ.34లక్షలతో బాహుదా ప్రాజెక్టు అభివృద్ధి పనులు



బాహుదా వద్ద పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

నిమ్మనపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టూరు పంచాయతిలో గల బాహుదా ప్రాజెక్టులో రూ.34లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఆమేరకు ఆయన బాహుదా ప్రాజక్టు వద్దకు చేరుకొని స్టేట్ డిసోడిన్ మెయింటినెన్స్ ఫండ్ (ఎస్‌డిఎమ్‌ఎఫ్) ద్వారా మంజూరైన పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ బాహుదాకు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని కనీసం గేట్లకు గ్రీసు కూడా వేయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికాలోకి రాగానే రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని ఎస్‌డీఎమ్‌ఎఫ్ ఫండ్ కింద నిధుల మంజూరు చేసి బాహుదాకు కావలసిన జనరేటర్ రూము నిర్మాణంతో పాటు కొత్త జనరేటర్ ఏర్పాటు, జంగల్ క్లియరెన్స్, తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు తవళం పంచాయతిలో ఎగువపల్లిలోని అనారోగ్యంలో బాధపడుతున్న సహదేవరెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. కార్యక్రమంలో వెంగంవారిపల్లి వైసీపీ సర్పంచ్ శ్రీవాణి టీడీపీలో చేరగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పార్టీ కండువా కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేష్‌బాబు, డీఈ కేడీఆర్ ప్రసాద్, బాహుదా ఏఈ శ్రీహరిరెడ్డి, మదనపల్లి ఏఈ ప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డెప్ప, ఆర్జే వెంకటేష్, రాజన్న, లక్ష్మన్న, శ్రీపతి, జయన్న, రాజా, బాస్కర్‌రెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత మల్లికార్జున జన్మదిన వేడుకలు





టీడీపీ నేత మల్లికార్జునాయుడుకు శుభాకాంక్షలు చెబుతున్న మార్పూరి సుధాకర్‌నాయుడు, పార్టీనేతలు, కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న దృశ్యం

మదనపల్లె/ములకలచెరువు/తంబళ్లపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టీడీపీ సీనియర్ నేత కోపూరి మల్లికార్జునాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రెడ్డీస్‌కాల నీలోని ఆయన నివాసంలో ఆదివారం మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలి పారు. అనతరం ఆయన అభిమానులు అన్నదానంతోపాటు వివధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకలకు తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి డి.జయచంద్రారెడ్డి, చిత్తూరు ఎమ్మె ల్యే గురజాల జగన్‌మోహన్, మం త్రి మండిపల్లె తమ్ముడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, స్థానిక మాజీఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా, జనసేన నేత గంగారపు రామ్‌దస్‌చౌదరి, నియోజక వర్గ టీడీపీ సమన్వయకర్త మార్పూరి సుధాకర్ నాయుడు, బీజేపీ నేత గుత్తా హరికృష్ణ, బెంగళూరు ప్రభాకర్, టీడీపీ నేతలు గంగారపు బాబురెడ్డి, కట్టా దొరస్వామినాయుడు, టి.కృష్ణమ నాయుడు, గంగారపు గౌతమ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ శేషాచలపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు. ములకలచెరువు, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల్లో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి భారీ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు పాల్గొన్నారు. తంబళ్లపల్లెలో రాజం పేట పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర మల్లికార్జున నాయుడు కలసి తిరుమల లడ్డూ ప్రసాదం అందచేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, జయరాంరెడ్డి, క్రిష్టారెడ్డి, ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం



సగవాసి బాలసుబ్రమణ్యంను సన్మానిస్తున్న కూటమి నాయకులు, గ్రామస్థులు

తంబళ్లపల్లె, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం ఆయన తంబళ్లపల్లె మండలంలోని ఆర్‌ఎన్‌తాండా పంచాయతీ ఎద్దులవారికోటలో దేవరెద్దు ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె కూటమి నాయకులు, గ్రామస్థులు సుగవాసికి ఘన స్వాగతం పలికి దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో నందిరెడ్డి, లక్ష్మీనర్సు, కొటాల మాజీ సర్పంచ్ రాము, మాజీ ఎంపీపీ నాంది రెడ్డప్ప, కోటకొండ మాజీ ఎంపీటీసీ సభ్యుడు రెడ్డప్ప, మని టీడీపీ, జనసేన, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఈశ్వరప్పకు ఆదివారం ఏఐటీ యూసీ, కార్పెంటర్ యూనియన్ నాయకులు రూ 30 వేలు ఆర్థిక సహాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈశ్వరప్ప నిరుపేద కుటుంబం కావడం గత కొన్ని రోజుల క్రితం అనుకోకుండా పక్షవాతానికి గురికావడంతో కుటుంబీకులు అప్పులు చేసి చికిత్సలు అందించారు. దీంతో ఆ కుటుంబానికి యూనియన్ తరుపున కొంత ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశ్యంతో యూనియన్ నాయకులు చేయి చేయి కలిపి తోటి కార్మికులు కొంత నగదును అందించి ఆదుకున్నారు. యూనియన్ నాయకులకు ఆ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేశారు. ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సలీంబాష, తంబళ్లపల్లె నియోజకవర్గ కార్యదర్శి బి. వేణుగోపాల్ రెడ్డి, కార్పెంటర్ యూనియన్ అధ్యక్షుడు బాలకృష్ణ, ట్రెజరర్‌ఎస్. గఫూర్, నాయకులు రమేష్, సయ్యద్ మస్తాన్, షబ్బీర్, నాగరాజు, సత్తార్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

వాల్మీకిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యో తి): నిరుపేదలను ఆదుకోవాలన్న లక్ష్యంతో వాల్మీకిపురం సీఎస్‌ఐ చర్చి సభ్యుడు ప్రభుచరణ్ స్థానిక చర్చి ఆవ రణలో ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండుగను పురస్కరిం చుకుని నిరుపేద వృద్ధులకు చీరలు, టవల్స్, పంచెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ క్రిస్మస్ మాసంలో ప్రతి ఒక్క క్రైస్తవుడు సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. క్రిస్మస్‌ను పురష్కరించుకుని పట్టణంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామ న్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఐ చర్చి అభివృద్ధి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



బాధితుడితో మాట్లాడుతున్న అధికారులు

కలకడ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి):ఎస్సీ, ఎస్టీ కేసు బాధితుడైన రెడ్డెప్పను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జయప్రకాశ్, పాలకుంట శ్రీనివాసులు పరామర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ నెల 19వ తేదీన కలకడ పోలీస్ స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆదివారం ఎనుగొండ పాలెం పంచాయితీ ఎస్సీకాలనీలో రెడ్డెప్ప ఇంటికి వెళ్లి వారు పరామర్శించి దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో నేతలు పాలకుంట నరసింహ, రవీంద్ర పాల్గొన్నారు.

ఉద్యమ నాయకుడు పీవీరావుకు ఘన నివాళి

వాల్మీకిపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): దళితుల కోసం తన ఉద్యోగాన్ని సైతం వదులుకుని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడిపిన పీవీరావుకు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య ఘనంగా నివాళులర్పించారు. పీవీరావు 19వ వర్ధంతిని పురష్కరించుకుని ఆదివారం వాల్మీకిపురం గాంధీబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి మాలమహానాడు నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గాంధీపేట రఘు, నాగార్జున, రమణ, జయన్న, రెడ్డెప్ప, సత్యమూర్తి, కృష్ణప్ప, వెంకటేష్, నాగరాజ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.